

చీనీ టన్ను రూ.16 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి. మార్కెట్‌కు 535 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.120
టమాట ధరలు గరిష్టంగానే కొనసాగుతున్నాయి. అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.120 పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
37.3°/21.9°
జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

10న డీవార్మింగ్ డే

- పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్ అరుణ్‌బాబు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తి అర్బన్: చిన్నారుల్లో రక్తహీనతకు కారణమవుతున్న నులి పురుగులను నివారించేందుకు ఈ నెల 10న జిల్లాలో డీవార్మింగ్‌డే నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన హాలులో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. 10వ తేదీ జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలల్లో డీవార్మింగ్ మాత్రలు ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. ఈ మాత్రలు రక్త హీనతను నివారిస్తాయన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో నమోదు కాని పిల్లలకు ఆగస్టు 17వ తేదీన ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ 400 మి.గ్రా మాత్రను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జేసీ చేతన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్‌వీ కృష్ణారెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్ర నాయక్, డీపీఎం కుల్లాయప్ప నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ నగర్ డైరెక్టర్‌గా బాలాజీ మురారి



నూతన డైరెక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల పరిధిలోని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల, శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్) డైరెక్టర్‌గా డాక్టర్ బాలాజీ మురారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్ కెకె నాగేలే తొమ్మిది నెలల క్రితం ఉద్యోగ విరమణ చేయడంతో కమలా బాయి ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న విషయం విదితమే. ప్రస్తుతం సీఐఏఈ (భోపాల్)లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ బాలాజీ మురారిని కేంద్ర ప్రభుత్వం గార్లదిన్నె ట్రాక్టర్ నగర్ డైరెక్టర్‌గా నియమించింది. నూతన డైరెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో సంస్థను అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం ట్రాక్టర్ నగర్ సిబ్బంది నూతన డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

హెచ్చెల్సీకి 1,500 క్యూసెక్కులు



అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం నుంచి జిల్లా వాటాగా 1,500 క్యూసెక్కుల చొప్పున హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయాలని తుంగభద్ర బోర్డుకు ఎస్‌ఈ రాజశేఖర్ ఇండెంట్ ఇచ్చారు. కొద్దిరోజులుగా నీటిని విడుదల చేస్తుండగా 500 క్యూసెక్కుల నుంచి రోజురోజుకూ క్రమంగా నీటిని పెంచుకుంటూ పోతున్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో 85.535 టీఎంసీలు నీటి నిల్వ ఉండగా 12,582 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. జలాశయం నుంచి 7,976 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో రూపంలో వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు.

అనంతపురం జిల్లా అనగానే పండ్లతోటలు, సిమెంటు పరిశ్రమలతో పాటు జీన్స్ వస్త్రాలు గుర్తుకు వస్తాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారి తర్వాత అంతగా జీన్స్ పరిశ్రమ ఉన్నది రాయదుర్గంలోనే. వేలాదిమంది కార్మికులు ఈ పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారు. వివిధ రాష్ట్రాలకు నాణ్యమైన జీన్స్ వస్త్రాలు ఇక్కడి నుంచే వెళుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 'వన్ డిస్ట్రిక్ట్–వన్ ప్రొడక్ట్' కింద రాయదుర్గం జీన్స్‌ను ఎంపిక చేసింది. ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరిశ్రమకు మరింత గుర్తింపు రానుంది.



రాయదుర్గంలోని ఓ యూనిట్‌లో జీన్స్ ప్యాంట్ల తయారీ

జీన్స్‌కు మరింత క్రేజీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వస్త్రాలలో జీన్స్ ఉత్పత్తులకు ఉన్న క్రేజీయే వేరు. నాణ్యత, అధునాతన డిజైన్లతో కూడిన జీన్స్ ప్యాంట్ల తయారీకి రాయదుర్గం ప్రాంతం ప్రసిద్ధిగాంచింది. ఇక్కడ జీన్స్ వస్త్రం, ప్యాంట్ల జిప్పులు, గుండీలు, దారం వంటి ముడి సరుకును గార్మెంట్స్ యజమానులు చైనా, అహ్మదాబాద్, బిల్వార్, బళ్లారి హోల్‌సేల్ డీలర్ల నుంచి దిగుమతి చేసుకుంటారు. ట్రెండ్స్‌కు అనుగుణంగా స్టిచ్చింగ్ చేస్తారు. ఇక్కడ తయారైన జీన్స్ ప్యాంట్లు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్రతో పాటు దేశంలోని ప్రముఖ నగరాలకు ఎగుమతి అవుతాయి.

వెయ్యికి పైగా యూనిట్లు

రాయదుర్గంలో జీన్స్ వస్త్రాల తయారీ యూనిట్లు వెయ్యికి పైనే ఉన్నాయి. అయినా ఈ పరిశ్రమకు ఇప్పటివరకూ అంతగా గుర్తింపు రాలేదు. నియోజకవర్గ వ్యాప్తంగా 40 వేల మంది కార్మికులు జీన్స్ తయారీలోనే ఉన్నారు. ఇక్కడి నుంచి రోజుకు సగటున 2 లక్షలకు పైగా ప్యాంట్లు అధునాతన డిజైన్లతో రూపుదిద్దుకుంటాయి. ఏటా రూ.700 కోట్ల వరకు టర్నోవర్ ఉంటుందని అంచనా. అలాంటి ఈ పరిశ్రమకు గుర్తింపునివ్వాలని సర్కారు భావించింది. ధర్మవరం పట్టు చీరలకు ఎలా అయితే గుర్తింపు లభించిందో ఇకపై దీనికీ అంతే. వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ కింద ఎంపిక చేసిన పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు ఇస్తారు. రాష్ట్ర, జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌లలో జిల్లా పేరు.. ఈ జిల్లా ఎందుకు ప్రసిద్ధి అనే విషయంలో జీన్స్‌ను చెబుతారు. దీంతో ఈ ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వస్తుంది.

ఓడీ–ఓపీ అంటేనే గుర్తింపు

ఓడీ–ఓపీ (వన్ డిస్ట్రిక్ట్–వన్ ప్రొడక్ట్) అనేది దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో తయారవుతున్న ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించడం. దేశ వ్యాప్తంగా 762 జిల్లాల్లో 1,102 ఉత్పత్తులను ఎంపిక చేశారు. మన రాష్ట్రంలో 26 జిల్లాల నుంచి 38 ఉత్పత్తులను ఎంపిక చేశారు. ఇందులో అనంతపురం జిల్లా నుంచి రాయదుర్గం జీన్స్ పరిశ్రమతో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలో ధర్మవరం పట్టుచీరలతో పాటు నిమ్మలకుంట తోలుబొమ్మలు ఉన్నాయి. పరిశ్రమల ప్రాచుర్యాన్ని, ప్రాభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే ఓడీ–ఓపీ ముఖ్య ఉద్దేశం. విశేష ప్రాచుర్యం కల్పించడం వల్ల భవిష్యత్‌లో జీన్స్ ప్యాంట్ల మార్కెట్ టర్నోవర్ పెరిగే అవకాశం ఉంది.



స్టిచింగ్ అనంతరం ఫినిషింగ్ వర్క్ చేస్తున్న కార్మికులు



జీన్స్ ప్యాంట్ల ప్యాకింగ్

రాయదుర్గంలో జీన్స్ యూనిట్లు
1,000 పైగా

రోజూ ప్యాంట్ల తయారీ
2 లక్షల పైనే

వార్షిక టర్నోవర్ అంచనా
రూ.**700** కోట్లు

నియోజకవర్గంలో ఉపాధి
40,000 మంది




ఇన్సెంటివ్‌లు ఇచ్చే అవకాశం



వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ కింద ఎంపిక చేసిన ఉత్పత్తులకు ఇకపై ఎక్కువ ప్రచారం లభిస్తుంది. అంతేకాదు ఈ ఉత్పత్తులను మరింతగా పెంచేందుకు ఇన్సెంటివ్‌లు ఇచ్చే ఆలోచన ఉంది. ఇలా జరిగితే ఆయా ఉత్పత్తుల మార్కెట్ విలువ బాగా పెరుగుతుంది. ఎక్కువ మార్కెట్ చేయొచ్చు.
–నాగరాజారావు, జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ

గుర్తింపు ఇవ్వడం సంతోషం



దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఉత్పత్తుల్లో రాయదుర్గం జీన్స్ ఉండటం అదృష్టం. సర్కారు ఈ పరిశ్రమను గుర్తించడం వల్ల భవిష్యత్‌లో ఇక్కడి పరిశ్రమకు మరింత మార్కెట్ పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల రాయదుర్గం పేరు నలుదిశలా వ్యాపిస్తుంది.
–కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

19న పంచాయతీల్లో ఉప ఎన్నికలు

- ఒక సర్పంచ్, 28 వార్డు స్థానాలకు ఎన్నికలు



పెదపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని 29 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 19న ఉప ఎన్నికలు జరగనున్నాయి. హిందూపురం మండలం చలివెందుల పంచాయతీ సర్పంచ్ (జనరల్) స్థానంతో పాటు 28 వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ సోమవారమే ప్రారంభమైందన్నారు. 8వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చన్నారు. 11వ తేదీ ఉదయం 10 గంటల అనంతరం నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ అభ్యంతరాల పరిష్కారం, 14వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ, సాయంత్రం 3 గంటల తర్వాత పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా వెల్లడిస్తామన్నారు. 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పోలింగ్ ఉంటుందని, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాల వెల్లడి ఉంటుందన్నారు. రీ పోలింగ్ అవసరమైతే 20వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకూ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులుగా ఈఓఆర్డీలను నియమించామన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి సంపూర్ణ రక్షణ



పుట్టపర్తి పీహెచ్‌సీలో చిన్నారికి టీకా వేస్తున్న డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి

ప్రశాంతి నిలయం: ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు సకాలంలో టీకాలను వేయించాలని, అప్పుడే పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరిగి రోగాల బారిన పడకుండా ఉంటారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురు పిల్లలకు టీకాలు వేసి 'మిషన్ ఇంద్ర ధనస్సు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన... టీకాల వల్ల కలిగే ప్రయోజనాలను ఆరోగ్య కేంద్రానికి వచ్చిన తల్లులు, గర్భవతులకు వివరించారు. చిన్నారులు ఆరోగ్యంగా ఉండటంలో టీకాలు ఎలాంటి పాత్ర పోషిస్తాయి... వాటిని ఎన్ని సంవత్సరాల వరకు వేయించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో 'మిషన్ ఇంద్ర ధనస్సు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆగస్టు 7వ తేదీ నుంచి 12 వరకు, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, అక్టోబర్ 9వ తేదీ నుంచి 14 వరకూ మిషన్ 'ఇంద్ర ధనస్సు' కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు టీకాలు వేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు తప్పని సరిగా టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్ర సాయి, సూపర్‌వైజర్ గోపి, ఆరోగ్య కార్యకర్తలు అజీజ్‌ఖాన్, పరిమళ, సుహాసిని, వీరచిన్నమ్మ, అమృత, ఆశా కార్యకర్తలు, ముత్యాలమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు సంపూర్ణ సహకారం



చేనేత స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



జాతీయ చేనేత దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

- జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: మగ్గాలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న నేతన్నలకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా అండనిస్తోందని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. సోమవారం చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో 9వ జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్ మాట్లాడుతూ... 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకం ద్వారా మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం ఏడాదికి రూ. 24 వేలు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. చేనేత వృత్తిని ప్రోత్సహించడానికి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు కార్మికులకు రాయితీలు ఇస్తోందన్నారు. అలాగే చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు 'ఆప్కో'ను ప్రోత్సహిస్తోందన్నారు. మార్కెటింగ్ పరంగా జిల్లా యంత్రాంగం తరఫున చేనేతల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. అనంతరం 'ఆప్కో' ఆధ్వర్యంలో ఏర్పాటు చేనేత ఉత్పత్తుల ప్రదర్శనను పరిశీలించి అభినందించారు. అంతకుముందు జిల్లా చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. చేనేత సంఘాల నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అధికారి రఘునాథరెడ్డి, ఈశ్వరయ్య, మహిళా సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల విడుదల



అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బీటెక్ నాల్గవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు, బీ.ఫార్మసీ నాల్గవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య బి.చంద్ర మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షా ఫలితాల కోసం జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్ https://jntuaresults.ac.in సంప్రదించాలని సూచించారు.

● జీవాలను కాపాడు స్వామీ



జీవాలను ఉత్సవ విగ్రహాల చుట్టూ ప్రదక్షిణ చేయిస్తున్న కాపర్లు

రొళ్ల: జీవాలు అనారోగ్యం బారిన పడకుండా కాపాడు స్వామీ అని పలువురు గొర్రెల కాపర్లు రంగనాథస్వామి, జుంజప్పస్వామికి మొక్కుకున్నారు. సోమవారం మండలంలోని కె.గొల్లహట్టి గ్రామంలో వెలసిన రంగనాథస్వామి, జుంజప్పస్వామి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వద్దకు తీసుకువచ్చి పట్టం కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా ఎనిమిది నెలల క్రితం మేత కోసం జీవాలను కర్ణాటక ప్రాంతానికి తీసుకువెళ్లి తిరిగి క్షేమంగా స్వగ్రామం చేరుకున్న కె.గొల్లహట్టి, రొళ్ల గొల్లహట్టి, సనేపల్లి గొల్లహట్టి చుట్టు పక్కల గ్రామాలకు చెందిన గొర్రె కాపరులు తమ జీవాలతో ఉత్సవ విగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇలా చేయడం వల్ల దేవుని దయ జీవాలపై ఉండి రోగాలు బారిన పడకుండా ఉంటాయని వారి నమ్మకం. అదేవిధంగా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ప్రత్యేకంగా పూజలు చేశారు.

అర్జీలకు మెరుగైన పరిష్కారం చూపాలి

- 'స్పందన'అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

పుట్టపర్తి అర్బన్: 'స్పందన'లో అందే ప్రతి అర్జీకి మెరుగైన పరిష్కారం చూపాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 226 అర్జీలు అందగా, కొన్నింటిపై అప్పటికప్పుడే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆయన డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'జగనన్నకు చెబుదాం', 'స్పందన' కార్యక్రమాల్లో అందే అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సకాలంలో సమస్య పరిష్కరించాలన్నారు. సమస్యలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. ఇందులో అలసత్వం పనికిరాదన్నారు. చిలమత్తూరు, గోరంట్ల, బుక్కపట్నం ఎంపీడీఓలు అర్జీల పరిష్కారంలో వెనుకబడ్డారని, గడువు ముగిసినా పరిష్కరించని అర్జీలు ఆయా మండలాల్లో ఎక్కువగా ఉన్నాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి పురోగతి చూపాలన్నారు. అలాగే డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే 'స్పందన' కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని, కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకూ అందరూ ఉండాల్సిందేనన్నారు. ఇకపై ఎవరైనా 'స్పందన'కు ఆలస్యంగా వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ ఎంటీ నాయక్, పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్‌ఖాన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డ్వామా పీడీ రామాంజనేయులు, సోషల్ వెల్ఫేర్ డీడీ శివ రంగప్రసాద్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల్లో కొన్ని...

- రామగిరి మండలం పేరూరు (అప్పర్ పెన్నార్) డ్యాం ఆయకట్టు కింద ఉన్న భూములకు వెళ్లే దారి సరిగా లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. వ్యవసాయ పనుల కోసం భూములకు చేరుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు, స్పందించి రహదారి ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.
- తన పాత ఇంటి షెడ్డుకు మరమ్మతులు చేసుకోనివ్వకుండా కొంతమంది అడ్డు పడుతున్నారని గోరంట్ల మండలం నారశింపల్లికి చెందిన సరోజమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన షెడ్డును ఆక్రమించుకోవాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

క్లుప్తంగా

బాలుడి ఆచూకీ లభ్యం



బాలుడిని పెనుకొండకు తీసుకెళ్తున్న పోలీసు

పెనుకొండ: పెనుకొండలో తప్పిపోయిన ఓ బాలుడు కొత్తచెరువులో పోలీసులకు చిక్కాడు. పోలీసుల వివరాలమేరకు... స్థానిక దర్గాపేటకు చెందిన ముజిమిల్ ఆదివారం రాత్రి వరకూ ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు షేక్‌మహమ్మద్ దంపతులు పలు ప్రాంతాల్లో గాలించారు. అయితే ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం ఫిర్యాదు చేశారు. ఈ సమాచారాన్ని పోలీసులు అన్ని పోలీస్‌స్టేషన్‌లకు అందజేశారు. ఈ నేపథ్యంలో ముజిమిల్ కొత్తచెరువులో పోలీసులకు పట్టుబడ్డాడు. అక్కడి నుంచి పోలీసులు పెనుకొండ పోలీస్‌స్టేషన్‌కు బాలున్ని చేర్చగా పోలీసులు బాలున్ని అప్పగించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

చిలమత్తూరు: మండలంలోని బలిజపల్లికి చెందిన రైతు విష్ణువర్ధన్‌రెడ్డి (40) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. విష్ణువర్ధన్‌రెడ్డికి గ్రామానికి సమీపంలో గల చిత్రావతి నది ఒడ్డున ఎకరా భూమి ఉంది. మొక్కజొన్న సాగు చేయగా సోమవారం పొలానికి నీరు పెట్టడానికి వెళ్లారు. అయితే విద్యుత్ వైర్లు మరమ్మతుకు గురికావడంతో వైర్లు జోడించే క్రమంలో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అర్జీలు పునరావృతం కానివ్వొద్దు

- సమస్యల పరిష్కారానికి కృషి చేయండి
- సిబ్బందికి ఎస్పీ మాధవరెడ్డి ఆదేశం

పుట్టపర్తి టౌన్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పునరావృతం కాకుండా త్వరగా పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగానే ప్రజల సమస్యలను ఆయనే ఓపిగ్గా విన్నారు. మొత్తం 63 అర్జీలను స్వీకరించారు. సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా సంబంధిత పోలీసుస్టేషన్లకు ఫోన్ చేసి మాట్లాడి అర్జీదారుడు సంతృప్తి చెందేలా గడువు లోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదన్నారు. స్పందన కార్యక్రమంలో ఎక్కువగా రస్తా వివాదాలు, కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు వంటివి ఎస్పీ దృష్టికి వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, లీగల్ అడ్వయిజర్ సాయినాథరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



- నా భర్త అరుణ్‌తేజ్‌ను కొంత మంది జూన్ 3న చంపి సాధారణ మరణంగా చిత్రీకరించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించాలని నిజాలు వెలికి తీయాలని ధర్మవరానికి చెందిన గీతాంజలి ఎస్పీ మాధవరెడ్డిని కోరారు. జూన్ 3న లక్కీ9 డాబాకు యజమానులు పవన్, నిఖిలేష్, నిఖిల్ కార్తిక్ తమ అనుచరులతో కలసి అరుణ్‌తేజ్‌ను రాళ్ల ,కట్టెతో కొట్టి తన రోడ్డుపై పడవేసి వెళ్లిపోయారని, వెంటనే ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అప్పటికే నా భర్త మరణించగా పోలీసులు, డాక్టర్‌ను మేనేజ్ చేసుకొని సాధారణ మరణంగా చిత్రీకరించారని ఆరోపించారు. ధర్మవరం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినా న్యాయం జరగలేదన్నారు. న్యాయం చేయండి సార్ అంటూ ఎస్పీని వేడుకున్నారు. ఎస్పీ వెంటనే ధర్మవరం డీఎస్పీతో ఫోన్‌చేసి మాట్లాడి న్యాయం చేయాలని ఆదేశించారు.



- మేము ఐదుగురు అన్నదమ్ములం. నేను వికలాంగుడిని. మాకు 5 ఎకరాల పొలం ఉంది. అందులో కొంతభూమిని గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు ప్రభుత్వం తీసుకోగా పరిహారంగా రూ.21 లక్షలు ఇచ్చింది. అయితే ఆ డబ్బులో నాకు రూపాయి కూడా ఇవ్వలేదు. సోదరులను అడిగితే కొట్టేందుకు వస్తున్నారు. గోరంట్ల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినా న్యాయం జరగలేదు. వాళ్ల వైపే మాట్లాడుతున్నారు. చుట్టు పక్కల వాళ్లు భోజనం పెడితే బతుకుతున్నా మీరే న్యాయం చేయాలంటూ గోరంట్ల మండలం కాంగారెడ్డిపల్లికి చెందిన బాబురెడ్డి ఎస్పీకి విన్నవించారు.

ఆటో బోల్తా - ఒకరి మృతి



ప్రమాదంలో మృతి చెందిన నాగరాజు

చెన్నేకొత్తపల్లి: ఆటో బోల్తాపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చందమూరు గ్రామం వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీధర్ వివరాల మేరకు... ధర్మవరం పట్టణం నుంచి ఎన్.ఎస్.గేట్ వైపు వస్తున్న ఆటో చందమూరు వద్దకు రాగానే ఆటో డ్రైవర్ అజాగ్రత్తతో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ధర్మవరం మండలం ధర్మపురానికి చెందిన నాగరాజు (33) ఆటో కింద పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. మృతునికి భార్య కళ్యాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

తలుపుల: మండలంలోని ఓబులరెడ్డిపల్లికి చెందిన బి.వెంకటరమణ (64) కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. స్థానికుల వివరాలమేరకు... వెంకటరమణ కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడేవాడుతున్నాడని తెలిపారు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి ఇంట్లో ఉన్న కలుపు విషపు మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు తలుపులకు, అక్కడి నుంచి కదిరికి, అక్కడి నుంచి అనంతపురంకు చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో సోమవారం వెంకటరమణ చనిపోయాడు. మృతునికి భార్య రమాదేవి, కుమారుడు అశోక్‌కుమార్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చౌక బియ్యం పట్టివేత

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం అగ్రహారం క్రాస్ వద్ద 50 బస్తాల బియ్యం రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు బుక్కపట్నం ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. సోమవారం అగ్రహారం క్రాస్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా పాముదుర్తి వైపు నుంచి రెండు ఆటోలలో రేషన్ బియ్యం నింపుకొని వస్తుండగా పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా రాగిరి కేశవ, సాకే దుర్గప్ప అని గుర్తించారు. వారిని అరెస్టు చేసి బియ్యంను సీజ్ చేసి బుక్కపట్నం పోలీస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



పట్టుబడిన రేషన్ బియాన్ని చూపుతున్న పోలీసులు

పొరపాట్లకు తావివ్వొద్దు

హిందూపురం: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సోమవారం జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయలు, లైటింగ్ ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. 18 ఏళ్లు నిండిన ఓటరుగా నమోదు చేయించాలన్నారు. అలాగే వివిధ వార్డుల్లోని ప్రజలతో ఇంటింటి సర్వే చేసిన తీరును నేరుగా అడిగి తెలుసుకున్నారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఓటరు జాబితా, ఓటరు నమోదుపై ఆరా తీశారు. ఓటరు నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలన్నారు.



చౌడేశ్వరీకాలనీలో ఇంటింటి సర్వేపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న జేసీ చేతన్

గుంజేపల్లి సచివాలయం పరిశీలన



గ్రామ సచివాలయాన్ని పరిశీలిస్తున్న సెంట్రల్ టీం అధికారి రామ్మోహన్

ముదిగుబ్బ: మండల పరిధిలోని గుంజేపల్లి పంచాయతీ గ్రామ సచివాలయాన్ని సోమవారం సెంట్రల్ టీం అధికారి రామ్మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై సిబ్బందితో ఆరా తీశారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యాలక్ష్మీ శివశంకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వలంటీర్ మృతి



మంజునాథ్(ఫైల్)

మడకశిర: పట్టణంలో వార్డు వలంటీర్‌గా పని చేస్తున్న మంజునాథ్ (28) సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. ఆరేపేట వార్డు సచివాలయంలో మంజునాథ్ వలంటీర్‌గా పని చేస్తున్నాడు. గాం.దీబజార్‌లోని తన స్వగృహంలో గుండెపోటు రాగా వెంటనే కుటుంబ సభ్యులు మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడికి నాలుగు నెలల క్రితమే వివాహమైంది. స్థానికులు, సచివాలయం సిబ్బంది, తోటి వలంటీర్లు మంజునాథ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి విజయవాడ నుంచి మంజునాథ్ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా మంజునాథ్ మృతికి సంతాపం తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో విద్యార్థిని మృతి

కనగానపల్లి: మండల పరిధిలోని తగరకుంటలో సోమవారం ఓ విద్యార్థిని అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. ఉరవకొండకు చెందిన భవాని (13) తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. దీంతో ఆమె తగరకుంటలో ఉన్న తన మేనత్త లలితమ్మ దగ్గర ఉంటూ స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుకొంటోంది. సోమవారం పాఠశాల నుంచి వచ్చిన భవాని అంగడి వద్ద ఉన్న మేనత్త దగ్గరకు వెళ్లి ఇంటి తాళం చెవి ఇప్పించుకొని ఇంటికి వెళ్లింది. తర్వాత లలితమ్మ ఇంటి లోపలికి వెళ్లి చూడగా భవాని ఇంటిలో ఊయలగా వేసిన చీరతో మెడకు చుట్టుకొని వేలాడుతూ కనిపించింది. కనగానపల్లి పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా మృతురాలు భవాని ప్రమాదవశాత్తూ చీర మెడకు చుట్టుకొని మృతి చెందిందా? లేక ఉరేసుకొని చనిపోయిందా? తేలాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో పోస్టుమాస్టర్ దుర్మరణం

రొళ్ల: కర్ణాటక రాష్ట్రం మధుగిరి తాలూకా బడవనహళ్లి హోబళి భీమనకుంట క్రాస్ వద్ద సోమవార జరిగిన రోడ్డు ప్రమాదంలో అసిస్టెంట్ పోస్టుమాస్టర్ ఆర్.రవికుమార్ (33) మృతి చెందారు. వివరాల్లోకెళితే.. మండలంలోని హులికుంటకు చెందిన ఆర్.రవికుమార్ గుడ్డగుర్కి తపాలా కార్యాలయంలో అసిస్టెంట్ పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పిల్లల విద్యాభ్యాసం కోసం బడవనహళ్లిలో నివాసం ఉండేవారు. రోజూ మాదిరిగానే విధుల కోసం బడవనహళ్లి నుంచి భార్య కృపతో కలిసి ద్విచక్ర వాహనంలో గుడ్డగుర్కికి బయలు దేరారు. అయితే భీమనకుంట క్రాస్ వద్దకు రాగానే అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే ఆర్.రవికుమార్ మృతి చెందారు. కృప కూడా తీవ్రంగా గాయపడ్డారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కృపను మెరుగైన వైద్యం కోసం తుమకూరు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులతో పాటు రొళ్ల, అగళి మండలాల తపాలశాఖ సిబ్బంది కన్నీరుమున్నీరయ్యారు.



ఆర్.రవికుమార్ (ఫైల్)

చెక్కు డ్రా చేసినందుకు దాడి చేశారు

- కొత్తచెరువు ఎంపీడీఓపై ఎస్పీకి ఫిర్యాదు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: కంప్యూటర్ కొనుగోలుకు ఇచ్చిన చెక్కు డ్రా చేసినందుకు తనపై కొత్తచెరువు ఎంపీడీఓ సిద్దారెడ్డి దాడికి పాల్పడ్డారని అనంతపురం కమలానగర్‌లోని డాల్ దుకాణం యజమాని మధు సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆయన వివరాలమేరకు.. ఎంపీడీఓ సిద్దారెడ్డి తన కుమార్తె కోసం కంప్యూటర్ కొనుగోలు చేసి రూ.39,800లకు చెక్కు ఇచ్చారు. 15 రోజుల్లో బ్యాంకులో వేసుకోవాలని సూచించారు. కానీ 15 రోజులు గడిచినా చెక్కు చెల్లుబాటు కాలేదు. అదిగో ఇదిగో అంటూ ఆరు నెలలు గడిచిపోయాయి. అయితే.. ఈ నెల నాల్గో తేదీన బ్యాంకులో చెక్కు వేయగా నగదు ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ ఐదో తేదీ సాయంత్రం దుకాణం వద్దకు వచ్చి డబ్బు ఎలా డ్రా చేస్తావంటూ అసభ్యంగా మాట్లాడారు. సెల్‌ఫోన్‌ను మీదకు విసిరారు. రిపేరీ చేసి టేబుల్‌పై ఉంచిన ప్రింటర్ పగులగొట్టారు. ఈ ఘటనపై బాధితుడు అనంతపురం టూటౌన్ పోలీసులను ఆశ్రయించగా.. వారు కేసు నమోదు చేయలేదు. దీంతో సోమవారం జిల్లా ఎస్పీని కలసి ఫిర్యాదు చేశాడు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

హిందూపురం అర్బన్: రైల్వేస్టేషన్ సమీపంలోని మాడల్ కాలనీ వద్ద రైలు పట్టాలపై గుర్తుతెలియని యువతి మృతదేహం (35) లభ్యమైంది. సోమవారం ఉదయం రైల్వే పోలీసులకు రైలు పట్టాలపై యువతి పడి మృతి చెందినట్లు సమాచారం రావడంతో రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. మృతురాలు పట్టణంలోని మేళాపురానికి చెందినదిన నాగమణిగా.. మతిస్థిమితం లేక తిరుగుతుంటుందని పోలీసులకు సమాచారం రావడంతో మేళాపురంలో మృతురాలి బంధువులెవరన్నది ఆరా తీస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం కొత్తకోటకు చెందిన సుజాత (38) బెంగళూరులో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ నరసింహులు వివరాలమేరకు... బుక్కపట్నం మండలం కొత్తకోటకు చెందిన కృష్ణమ్మ కుమార్తె సుజాతను నల్లమాడకు చెందిన నరసింహులుకు ఇచ్చి వివాహం చేశారు. అయితే కడుపు నొప్పి తాళలేక గత నెల 31న సుజాత సూపర్ వాస్మోల్ తగింది. ఇందులో భాగంగానే బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహులు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్యాయత్నం

లేపాక్షి: భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి గురైన భర్త పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకున్న సంఘటన లేపాక్షిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. అమడగూరు మండలం ఆకువానిపల్లికి చెందిన హరికృష్ణ (23) చిలమత్తూరు మండలం గాద్రాలపల్లికి చెందిన లలిత (20)ను రెండేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే సంవత్సరం క్రితం ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. అప్పటి నుంచి హరికృష్ణ బెంగళూరులో పని చేసుకుంటున్నాడు. లలిత లేపాక్షిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటోంది. అయితే సోమవారం ఉదయం భార్య లలితను మళ్లీ కాపురానికి తీసుకెళ్లేందుకు ఆ కళాశాల వద్దకు వచ్చాడు. విషయం తెలుసుకున్న లలిత ఎంతసేపటికి రాకపోవడంతో హరికృష్ణ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నించాడు. అక్కడున్న విద్యార్థులు అడ్డుకున్నారు. హరికృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నిప్పు అంటించుకోవడంతో గాయాలైన హరికృష్ణ

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రశాంతి నిలయం: ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఎన్నికైనా కార్యవర్గం జాబితాను డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి చేతులు మీదుగా విడుదల చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కేబీ హళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు శ్రీదేవి, ఉపాధ్యక్షులుగా చెన్నారెడ్డి, పద్మజ, జాయింట్ సెక్రెటరీలుగా సునీల్, సల్మా, రవికుమార్, జనరల్ సెక్రెటరీలుగా శివరాం, ట్రెజరర్‌గా మాధుర్యా, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా జ్యోతిని ఎంపిక చేశారు. అలాగే పబ్లిసిటీ సెక్రెటరీగా మున్వర్ బాషాతో పాటు మరో ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ కేసీ.కుళ్లాయప్పనాయక్, డీఐఓ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులతో డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి

ఫుట్‌బాల్ జిల్లా జట్టు ప్రాబబుల్స్ ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

హిందూపురం టౌన్: హిందూపురం ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్ జూనియర్స్ అండర్-14 బాల, బాలికల జట్ల ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. అండర్-14 జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికను ఆదివారం సాయంత్రం స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 15 ఫుట్‌బాల్ క్లబ్‌ల నుంచి 80 మంది బాలురు, 40 మంది బాలికలు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ కనబరిచిన 25 మంది చొప్పున బాల, బాలికల జట్లను ప్రాబబుల్స్‌గా ఎంపిక చేశారు. త్వరలో క్యాంపు నిర్వహించి తుది జట్టును ప్రకటిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన జట్టు కడపలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ తెలిపారు.

'అనంత'లో చెలరేగిన చైన్‌స్నాచర్లు

- మూడు చోట్ల బంగారు చైన్ల అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: చైన్‌స్నాచర్లు మరోసారి రెచ్చిపోయారు. నగరంలోని రెండు ప్రాంతాలతో పాటు గార్లదిన్నెలోనూ బంగారు చైన్లను అపహరించారు. నగరంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన కాకర్ల రంగమ్మ నాల్గవపోలీసుస్టేషన్‌కు అనుకొని ఉన్న రహదారిపై పాలప్యాకెట్ కోసం దుకాణానికి వెళ్లి ఇంటికి వెళ్తోంది. చైన్‌స్నాచర్లు అదును చూసి ఆమె మెడలోని 3.5 తులాల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. బాధితురాలు సమీపంలోని నాల్గవ పట్టణ పోలీసులను ఆశ్రయించింది.

వన్‌టౌన్ పరిధిలో..

వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని గఫూర్ ఆస్పత్రి వన్‌వే రోడ్డుపై తెల్లవారు జాము 5.10 గంటలకు ఇంటి ముందు కళ్లాపి చల్లుతున్న మహిళ మెడలో 1.50 తులాల బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు. బాధితురాలు గట్టిగా అరచినా ఫలితం లేకపోయింది. అప్పటికే చైన్‌స్నాచర్లు అక్కడి నుంచి ధర్మవరం రహదారి వైపుగా వెళ్లిపోయారు. బాధిత కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చైన్‌స్నాచర్ల ఆనవాళ్ల కోసం గాలిస్తున్నారు.

సిగరెట్ అడుగుతూ...

ఓ మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు చైన్‌ను దొంగలు లాక్కెళ్లిన సంఘటన గార్లదిన్నె మండలం కల్లూరు పరిధిలోని అగ్రహారంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. అగ్రహారం గ్రామానికి చెందిన నీలం నీలమ్మ అనే మహిళ చిన్న కిరాణా అంగడి వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తోంది. ఉదయం నీలం నీలమ్మ అంగడిలో ఉండగా ఇద్దరు యువకులు ఎర్రని పల్సర్ బైక్‌లో వచ్చి సిగరెట్ కావాలని అడిగారు. నీలమ్మ సిగరెట్ ఇస్తుండగా ఇదే అదునుగా భావించిన దుండగులు మహిళ మెడలోని 2 తులాల బంగారు చైన్ దొంగిలించి ద్విచక్ర వాహనంలో పరారయ్యారు. వెంటనే అప్రమత్తమైన మహిళ గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చే లోపు వారు పారిపోయారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.